# ప్రాయశ్చిత్తం

"వెంకటేశం మూడువేలు కావాల్రా-"

వెంకటేశం కళ్లెత్తి పోస్టుమాస్టరు రామారావు కళ్లల్లోకి చూశాడు.

ఆ కళ్లలో ఏ భావము దొరకలేదు.

"రామూ. రెండు నెల్లుగా నెలకి మూడువేలు అప్పు చేశావు. ఎందుకూ అని నేను అడగలేదు. మళ్లీ మూడువేలు ఇమ్మంటున్నావు... ప్రోబ్లం చెప్పకూడదా.."

"వచ్చేనెల వడ్డీతోబాటు ఇచ్చేస్తారా"

'వడ్డీకాదు. అసలు కూడా ఇవ్వకపోయినా నా ఆస్తి తరగదు. మనస్నేహం చెడదు. నువ్విలా అప్పు చేస్తున్నావంటే నాకెందుకో కొంచెం భయం-చిన్న డౌటూ కూడా... మా అక్కయ్యగారి కళ్లు కప్పి చిన్నక్కయ్యగారిని పరిచయం చెయ్యావుకదా.." వెంకటేశం.

చలాకీగా చమత్కారంగా అన్నా రామారావు మనసు కలుక్కుమంది.

ఆ విషయం కూడా వెంకటేశం చదివేశాడు.

రామారావు మౌనాన్ని చెదరగొడుతూ.."నేను వివరం అడగటం తప్పేరా..ఇదిగో మూడువేలు-" పరుసులోంచి మూడు వెయ్యినోట్లు అందించాడు.

తీసుకోనా వద్దా అని ఒక్కక్షణం తటపటాయించాడు-రామారావు-

"తీసుకోరా... నేను ఇవ్వనూ అని అనలేదు. దేనికిరా? అని అడిగాను. జవాబు చెప్పద్దులే తీసుకో-"

డబ్బు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు రామారావు.

రామారావుకీ వెంకటేశానికి బాల్యస్నేహం- అంతస్తుల్లో ఆస్తుల్లో ఇద్దరికీ నేలకీ నింగికీ ఉన్నంత వ్యత్యాసం ఉంది.

వెంకటేశాన్ని..తండ్రి కోటీశ్వరుడుగా ఉన్నప్పుడు కన్నాడు.

ముప్ఫయ్యేళ్లు అతన్నీ పదింతలుగా ఆస్తినీ పెంచి పోయినేడాదే చనిపోయాడు.

కాస్త ఊహ వచ్చినప్పణ్నుంచీ..వెంకటేశానికి తను డబ్బులున్నవాళ్ల అబ్బాయినని తెల్సింది-మొదట్లో తోటి పిల్లల్లో గొప్పగా ఉండేది- కానీ కొంచెం పెద్దవుతోంటే వాళ్లు తనతో ఆడుకోట్లేదని డబ్బు అంత మంచిది కాదేమోనని బాధేసేది-

రామారావు వాళ్ల నాన్నగారు కూడా తమంత కాకపోయినా కాస్త ఉన్నవాళ్లే

అందుకేనేమో రామారావు వెంకటేశంతో చాలా స్నేహంగా తిరిగేవాడు.

వెంకటేశం ఇంటర్మీడియెట్ చదువుతూండేనాటికి తండ్రి రాజారాం కోట్లమీద కోట్లు పేరుస్తుండటం స్పష్టమైంది.

అతను చేసే తణఖా వ్యాపారం ఎంతమంది పొలాల్నో తమ పొలాల్లో కలిపేసింది. ఇంచుమించు సగం ఊరు వెంకటేశం నాన్నదే అని చెప్పచ్చు.

ఈ వ్యాపారం చేస్తూ అతనెంతమందిని బికారుల్ని చేసాడో ఈ

రామారావు తండ్రికున్న పొలం కూడా వెంకటేశం పొలంలోకి జారిపోయిందని తెల్సింది. వెంకటేశం చాలా బాధపడ్డాడు.

"డబ్బుల్తల్లి డబ్బులున్నవాల్లకే పిల్లల్ని కని ఇస్తుందిరా! మీ తండ్రిని తప్పట్టుకుని నువు ఎక్కువ ఫీలవకు" అని రామారావు ఫ్రెండని ఓదార్చాడు.

బాగా చదువుకుందామనుకున్న రామారావు కోరిక తీరలేదు. వాల్లింటి అరుగుమీద గదిలో ఉన్న చిన్న పోస్టఫీసుకి రన్నరూ, పోస్టుమాస్టరూ, పోస్టుమేన్నూగా తండ్రి చేసే ఉద్యోగానికి వారసుడయ్యాడు- పక్క ఊరు సబ్ పోస్టాఫీసుకి వెళ్లటం- ఉత్తరాలూ మనియార్డర్ల డబ్బులూ తెచ్చి, ఊళ్లో పంచిపెట్టటం-వాళ్లు చెప్పిన జవాబులు రాసిపెట్టటం.. చాలా హడావుడిగా రామారావు బతుకు బండి నడిచిపోతోంది.

వెంకటేశానికి వచ్చిన లెక్కలూ..ఇంగ్లీషూ..ఈ వ్యాపారాన్ని చక్కదిద్దడానికీ కోట్లు గడించడానికీ చాలని. ఊళ్లో ఉన్న కాలేజీలో చదువయిపోగానే పుస్తకాలు అటకెక్కించెయ్యమన్నాడు తండ్రి.

నాన్నకి ఎదురు చెప్పడం అలవాటు లేని వెంకటేశం అయిష్టంగానే అలా చేశాడు.

చదువులు మానేసినా బతుకులు మారిపోయినా రెండ్రోజులకి ఓసారైనా స్నేహితులు ఇద్దరూ కల్సి స్నేహాభిమానాలు పంచుకుంటారు-

తరచుగా వెంకటేశాన్ని ఓదార్చవల్సి వస్తుంటుంది రామారావుకి- వెంకటేశం పడుతూన్న మానసిక వ్యధకి తండ్రి మరణించడంతో కొంత ప్రశాంతత చిక్కినట్లైంది. తండ్రి చేసిన పాపాలకి ప్రాయశ్చిత్తంగా కొన్ని మంచి పనులు చేయాలని ఆత్రపడిపోయేవాడు.

ఊరికి దగ్గరగా ఉన్నపొలంలో పేదవాల్లకి ఓ కాలనీ నిర్మించిచ్చాడు.

జూనియరు కాలేజీ భవనాన్ని విస్తరింపజేసి ఊరికి డిగ్రీ కాలేజీ వచ్చేలా చూసాడు. అలాగే ఆలయాలు పునరుద్ధరించాడు. అన్నింటికీ తండ్రి పేరు పెట్టించాడు. రామారావు తండ్రి పొలాన్ని అతనికి తిరిగి ఇచ్చేయాలని ప్రయత్నం చాశాడు. కానీ రామారావు వప్పుకోలేదు. "మీ తండ్రి వ్యాపారం చేశాడు. మేము వినియోగించుకున్నాం. నువ్విలా వ్యక్తిగతంగా ఎవ్వరికీ బాకీ పడ్డట్టు తీర్చక్కర్లేదు. ఊరుకు ఉపయోగపడి మీ నాన్నకిపేరు తీసుకొచ్చి రుణం తీర్చుకో" అని నచ్చచెప్పి అతనికి కర్తవ్యబోధ చేశాడు. "అదే ప్రాయశ్చిత్తం అనుకో-ఆయనకు ఆత్మశుద్ధి" అన్నాడు రామారావు. ఉచిత వైద్యశాలలూ- మంచినీళ్ల సదుపాయాలూలాంటి ఎన్నెన్నో మంచి పనులు చేయించాడు. రామారావు వెంకటేశంతో. 'ఎంత అవసరం వచ్చినా రామారావు డబ్బు అడిగేవాడు కాదే.. అలాంటిది మూడు నెలల నుంచీ మూడువేలు చొప్పున డబ్బు తీసుకెల్తున్నాడే..ఏంటి ప్రోబ్లం..' అని వెంకటేశం కంగారుపడటంలో అర్థం వుంది- అభిమానస్తుడన్న అభిమానం ఉంది.

ఇంకో నెల గడిచింది. రామారావు వెంకటేశాన్ని మళ్లీ మూడువేలు అడగడానికొచ్చాడు. వెంటనే తీసి ఇచ్చాడు వెంకటేశం.

"ఎందుకు...దేనికీ..అని నువ్వడగపోయినా చెప్తానురా" అన్నాడు రామారావు.

"అలాక్కానియ. మీ పోస్టల వాళ్లు జవాబు ఇవ్వటం ఎప్పుడూ లేటే-"

"ఆరూ బై ఇరవై ఒకటి ఏంట్రా. ఆ పోస్టల భాష మానేసి మనుషుల భాషలో చెప్పి ఛావు-"

రామారావు చిన్నగా నవ్వి "అదేరా.. ఎల్లమ్మ గుడి పక్క వీరబాబు లేడూ.."

"ఆ..ఆ సైకిల రిపేరు షాపువాడా? వాడికి పక్షవాతం వచ్చి కోడలు

పంక్చర్లు వేస్తోందిట కదా.."

ఆ అమ్మాయి కష్టపడుతూ ఇద్దరు పిల్లల్నీ మావగార్నీ పోషిస్తోంది-వీరబాబు నులకమంచం మీద కూచుని కోడలు పని నేర్చుకుంటాననంటే 'వద్దు-కాదూ అనకుండా పని నేర్పించాడు. రోజుకు నాలుగు పన్లు వచ్చి పది రూపాయలు చేతిలో పడినా ముసలాయన మందులు ఖర్చు నడిచిపోతుంది.

"వీరబాబు కొడుకు మిలట్రీలో పనికదా.. మనీయార్డరు చేస్తుండేవాడు కదా..పంపట్లేదా"

"రెండు నెలల నుంచి పైకం రావట్లేదు-"

రామారావు గొంతులో సన్నటి వణుకుని వెంకటేశం పసిగట్టాడు.

"ఏమైంది..." ఆత్రంగా అడిగాడు.

"మొన్న ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడుట. అక్కడే మిలట్రీ హాస్పిటలలో చేర్పించారుట. టెలిగ్రాం వచ్చింది. క్రితం నెల ఉత్తరం కూడా రాయించాడు. ఇంకో రెండు నెలల్లో డిశ్చార్జి చేస్తారు. ఇంటికొస్తాను. అందాకా మావాళ్లని కనిపెట్టుకు చూడమని బతిమాల్తూ రాశాడు పాపం.."

"ప్రాణం అయితే నిల్చిందిగానీ రెండు కాల్లూ తీసేయాల్సి వచ్చిందిట... ఈ సంగతి అప్పుడే ఇంట్లో చెప్పద్దని, వాళ్లు విషయం తెలిస్తే నన్ను చూడ్డానికి వస్తానని తయారవుతారు. వాళ్లు రావడమూ కష్టమే... ఇక్కడ నాకోసం తిరగడమూ కష్టమే. కనక కొన్నాల్లు దయతలచండి" అని ఏడుస్తూ రాశాడు.

"నిజమే కదా..భాషరాని దేవంలో ఎన్ని ఇబ్బందులు పడాలోకదా.."

"అందుకే కొడుకునుంచే మనియార్డరు వచ్చిందని మభ్యపెట్టి

ఇస్తున్నాను. ఈ డబ్బు అందకపోతే..కొడుకు కేదో అయిందని, అందుకే డబ్బు పంపట్లేదని ఊహించేసుకుని బెంబేలెత్తిపోతాడు వీరబాబు.

ఉద్యోగం మానేసి వచ్చాక ఇతనికి నష్టపరిహారం ఏదో వస్తుంది. అప్పుడు అప్పు తీరుస్తానన్నాడు.

ఊళ్లో ఎవరిని అడిగినా ఆనోటా ఈనోటా ఈ వార్త వీరబాబు ఇంటికి చేరిపోతుంది. అందుకనే ఎవ్వరికీ చెప్పలేదురా.."

రామారావు చెప్పిన విషయం విని వెంకటేశం గుండె తడయ్యింది.

ఆ కుటుంబానికి సాయబడ్డానికి అతను ఎంత తాపత్రయ పడుతున్నాడో తెల్సుకుని అంతమంచి ఫ్రెండ్ తనకున్నందుకు పులకించిపోయాడు.

వీరబాబు కొడుకు వచ్చేసరికి అతనికోసం హేండ్ ఫెడల్ చక్రాల కుర్చీ కొన్నాడు వెంకటేశం.

దేశం కోసం పోరాడి వచ్చిన అతనికి గౌరవంగా స్వాగతం చెప్పాడు. వూళ్లో రావి చెట్టుకింద పెద్ద సన్మానం చేయించాడు.

కొడుకుని చూసి గుండె చెరువైన వీరబాబుకి ఊర్లో అందరూ తమని గౌరవిస్తున్నందుకు కృతజ్ఞత పొంగిపొరలింది.

వెంకటేశం కాళ్లని కన్నీల్లతో కడిగింది జవాను భార్య. గంభీరంగా వెనుదిరిగిన వెంకటేశం రామారావుని మనసారా కౌగిలించుకుని గద్గద కంఠంగా " ఈ మంచితనం నీదేరా.. ఈ మొక్కులూ నీకేరా" అన్నాడు-

ఆ ఊరి పెద్దవీధిలో... 'వీర జవాన్ సైకిల్ టేక్సీ మరియు కిరాణ దుకాణం' ఇప్పటికీ కిటకిటలాడుతూంటుంది.

